సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 5 । అక్టోబర్ । 2023



ఆలయంలో మరిన్ని సౌకర్యాలు

భక్తుల రద్దీకి అనుగుణంగా పెద్దమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే వనమా తెలిపారు. IIలో



అంగన్‌వాడీల సమ్మె విరమణ

తమ సమస్యల పరిష్కారం కోసం 23 రోజులుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. IIలో

గరిష్టం / కనిష్టం
33° / 20°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో అహోబిల జీయర్ స్వామి

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు స్నపన తిరుమంజనం కమనీయంగా జరిపారు. ప్రతి బుధవారం ఉత్సవమూర్తులకు ఈ వేడుక నిర్వహిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సారె సమర్పించిన అహోబిల జీయర్‌స్వామి

సీతమ్మవారికి అహోబిల జీయర్ స్వామి బుధవారం సారె సమర్పించారు. చిన్న జీయర్ మఠం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సమర్పించారు. అనంతరం బేడా మండపంలో జరిగిన నిత్యకల్యాణంలో పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: ఇండియన్ బ్యాంక్ ప్రొబెషనరీ ఆఫీసర్లు, గుమస్తా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అవసరమయ్యే శిక్షణను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ వారు హైదరాబాద్ పీఈటీసీలో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎస్టీలు 75, ఎస్సీలు 15, బీసీలు 10.. మొత్తం 100 మందికి ఈనెల 16 నుంచి శిక్షణ ఇస్తారని, అభ్యర్థుల అర్హత ఆధారంగా ఎంపిక చేస్తారని తెలిపారు. శిక్షణ పొందాలనుకునే వారు ఈనెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపున్నవారే అర్హులని వివరించారు.

ఉద్యాన పంటలు పరిశీలన

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో సాగు చేస్తున్న డ్రాగన్‌ఫ్రూట్, మామిడి, జామ, బొప్పాయి, అరటి తదితర పండ్ల తోటలు, కూరగాయల పంటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పిండి నల్లి నివారణ చర్యలను వివరించారు. పిండినల్లి అన్నిరకాల మొక్కలను ఆశిస్తుందని, కలుపు మొక్కలు పిండి పురుగులకు ప్రత్యామ్నాయ ఆవాసాలుగా పనిచేసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పొలాల చుట్టూ, గట్ల మీద కలుపులేకుండా చూడాలని సూచించారు. పిండినల్లి ఆశించిన మొక్కల భాగాలు ఎదగవని, పూత, పిందె రాలుతుందని, మంగు ఏర్పడుతుందని వివరించారు. ఆ భాగాలను కత్తిరించాలన్నారు. పిండినల్లి నివారణకు ఏసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బాగా కుళ్లిన ఎరువు లేదా కంపోస్టు, ఎకరానికి 200 కేజీల వేపచెక్కను, 500 కేజీల వర్మికంపోస్టును అందించాలని సూచించారు.

ఆలయాల్లో ఆర్‌జేసీ పూజలు



కొత్తగూడెం గణేశ్ టెంపుల్‌లో రామకృష్ణారావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొత్తగూడెంటౌన్/అన్నపురెడ్డిపల్లి: జిల్లాలో దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) ఎం.రామకృష్ణారావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కేంద్రంలోని శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేశ్ టెంపుల్)లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించాక అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆ తర్వాత అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి, శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ సులోచన, అధికారులు సమత, భేల్‌సింగ్, వెంకటేశ్వర్లు, పీవీ రమణ, బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దారి మళ్లితే కష్టమే..

మణుగూరు ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌కు బదులు కాచిగూడ నుంచి..

- డిసెంబర్ 17న కొత్త షెడ్యూల్ అమల్లోకి..
- ఫలితంగా జిల్లా వాసులకు తీరని అన్యాయం
- ఎంపీలు పట్టించుకోవాలంటున్న ప్రయాణికులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రైల్వేశాఖ పరంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఇక్కడి నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు ఎంపీలు దీనిపై దృష్టి సారించాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

మణుగూరు రైలు కాచిగూడ నుంచి..

సికింద్రాబాద్ – మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణికుల రద్దీ ఎక్కువ. తక్కువ ఖర్చుతో రాష్ట్ర రాజధానికి చేరుకునేందుకు ఈ రైలు అనువుగా ఉంది. పైగా ఉదయం ఇతర పనులు చూసుకుని రాత్రి పూట ప్రయాణించే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది దీనిపైనే ఆధారపడుతుంటారు. అయితే ఈ రైలును వచ్చే డిసెంబర్ 17వ తేదీ నుంచి సికింద్రాబాద్ కాకుండా కాచిగూడ నుండి నడిపించాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే, కాచిగూడ అధికారుల నుంచి ప్రకటన వెలువడింది. కొత్తగా రాబోయే మార్పు ప్రకారం రాత్రి 11:30 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరే మణుగూరు ఎక్స్‌ప్రెస్ మల్కాజ్‌గిరి, మౌలాలి, చర్లపల్లి, కాజీపేట, డోర్నకల్, భద్రాచలం రోడ్ మీదుగా మణుగూరు చేరుకుంటుంది. మారిన షెడ్యూల్ కారణంగా ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్లదు.

గుంటూరు కోసం..

మణుగూరు – సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు పదేళ్ల క్రితం పట్టాలెక్కింది. మణుగూరులో రాత్రి 10:40 గంటలకు బయలుదేరే ఈ రైలు తెల్లవారుజామున 3:45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 11:30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి ఉదయం 5:45 గంటలకు మణుగూరు చేరుకుంటుంది. అయితే ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ రైలును సికింద్రాబాద్ యార్డులో నిలిపి ఉంచేందుకు స్థల లభ్యత కష్టంగా మారింది. దీంతో ఏడాది క్రితం నుంచి ఈ రైలు రేక్‌లను సికింద్రాబాద్ – గుంటూరు ఎక్స్‌ప్రెస్ వయా కాచిగూడ మీదుగా నడిపిస్తున్నారు. ఈ రేక్ షేరింగ్ కారణంగా సికింద్రాబాద్ – మణుగూరు ఎక్స్‌ప్రెస్ వారంలో ఐదు రోజులు ఆలస్యంగా రావడం పరిపాటిగా మారింది. ఇది చాలదన్నట్టు గుంటూరు ఎక్స్‌ప్రెస్ సౌలభ్యం కోసం మణుగూరుకు వచ్చే రైలును సికింద్రాబాద్ నుంచి కాకుండా కాచిగూడ నుంచి నడిపించాలని నిర్ణయించారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌ల లభ్యత లేదంటూ దీనికి సాకుగా చూపిస్తున్నారు. వాస్తవానికి మణుగూరు ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చి, పోయే సమయాల్లో రైళ్ల రద్దీనే లేదు.

కాచిగూడ అయితే కష్టమే..

వందల ఏళ్లుగా రైళ్ల రాకపోకలకు సికింద్రాబాద్ స్టేషన్ ప్రసిద్ధి. ఇక్కడ రైలు దిగిన వెంటనే నగరంలోని నలుమూలలకు వెళ్లేందుకు సిటీ బస్సులు సిద్ధంగా ఉంటాయి. కొత్తగా రెండు మెట్రో రైలు స్టేషన్లు సైతం అందుబాటులోకి వచ్చాయి. జిల్లా నుంచి వెళ్లే వారు సికింద్రాబాద్‌లో రైలు దిగిన తర్వాత నగరంలో వారు వెళ్లాల్సిన చోటుకు సులువుగా చేరుకునే వీలుంది. అదే కాచిగూడ, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల నుంచి నగరం నలుమూలలకు సిటీబస్సులు అందుబాటులో ఉండవు. మెట్రో రైలు సౌకర్యం అసలే లేదు. కొత్త మార్పుల కారణంగా ఈ రైలు ద్వారా రాకపోకలు సాగించే జిల్లా వాసులకు ఇబ్బందులు తప్పవు.

ఎంపీలు స్పందిస్తేనే ఫలితం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుంచి నలుగురు ఎంపీలు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో లోక్‌సభలో నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, రాజ్యసభలో బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. రైల్వే పరంగా జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై వీరంతా ఆ శాఖపై ఒత్తిడి తీసుకురావాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు. ఎంపీలు గట్టిగా పట్టుబడితే సత్తుపల్లికి రైలు రావడంతో పాటు మణుగూరు ఎక్స్‌ప్రెస్ గమ్యస్థానం మార్పు, గతంలో నడిచి రద్దయిన పలు రైళ్లు తిరిగి పట్టాలెక్కే అవకాశం ఉంది.

సత్తుపల్లి రైలు ఊసేలేదు..

రాష్ట్ర విభజనకు ముందే భద్రాచలం రోడ్ – సత్తుపల్లి రైల్వే పనులకు ఆమోదం లభించింది. సింగరేణి సహకారంతో గతేడాది రైల్వేశాఖ ఈ లైన్‌ను ప్రారంభించింది. ఏడాది పూర్తి కావస్తున్న ఇంతవరకూ సత్తుపల్లికి ప్యాసింజర్ రైలు వస్తుందా ? రాదా అనేది డోలాయమానంలోనే ఉంది. మరోవైపు సిద్దిపేట – సికింద్రాబాద్ రైలుకు రైల్వే అధికారులు పచ్చ జెండా ఊపారు. సత్తుపల్లిలో లభించే బొగ్గును రవాణా చేయడం ద్వారా కోట్లాది రూపాయల ఆదాయాన్ని రైల్వేశాఖ తన ఖాతాలో వేసుకుంటున్నా.. ఇక్కడి ప్రజల ప్రయోజనాలు, అవసరాల రీత్యా ప్యాసింజర్ రైలును నడపడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది.

లెక్క తేలింది..

- జిల్లాలోని ఓటర్ల సంఖ్య 9,45,094
- పురుషులు 4,61,315, మహిళలు 4,83,741, ఇతరులు 38 మంది
- అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే అధికం
- తుది ఓటర్ల జాబితా విడుదల

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో తుది ఓటరు జాబితాను బుధవారం విడుదల చేశారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో కొత్తగూడెం జనరల్ కాగా, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు. ఇక అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. జిల్లా వ్యాప్తంగా 9,45,094 ఓటర్లు ఉండగా.. పురుషులు 4,61,315 మంది, మహిళలు 4,83,741 మంది, ఇతరులు 38 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 22,426 మంది అధికంగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

- జిల్లాలో జనరల్ నియోజకవర్గమైన కొత్తగూడెంలో అధిక ఓటర్లు ఉన్నారు. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,36,903 మంది కాగా, పురుషులు 1,14,995, మహిళలు 1,21,886, ట్రాన్స్‌జెండర్లు 22 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 6,891 అధికంగా ఉన్నారు.
- ఇల్లెందు నియోజకవర్గం ఓటర్ల సంఖ్యలో ద్వితీయ స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,14,527 ఉండగా పురుషులు 1,05,485, మహిళలు 1,09,040 మంది ఉన్నారు. ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళలు 3,555 మంది అధికంగా ఉన్నారు.
- పినపాక నియోజకవర్గంలో మొత్తం 1,93,943 మంది ఓటర్లు ఉండగా పురుషులు 95,704 మంది, మహిళలు 98,235 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఉన్నారు. ఇక్కడ పురుషుల కంటే మహిళా ఓటర్లు 2,531 మంది ఎక్కువ.
- అశ్వారావుపేట నియోజకవర్గంలో మొత్తం 1,53,757 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 75,080 మంది, మహిళలు 78,671 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 3,591 మంది అధికంగా ఉన్నారు.
- భద్రాచలంలో మొత్తం ఓటర్లు 1,45,964 మంది కాగా, పురుషులు 70,051 మంది, మహిళలు 75,909 మంది, ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఉన్నారు. ఇక్కడ పురుషుల కంటే మహిళా ఓటర్లు 5,858 మంది ఎక్కువగా ఉన్నారు.



ప్రత్యేక ఓటరు నమోదు భేష్

జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం బాగా జరిగింది. ఇందులో భాగస్వాములైన వారందరికీ అభినందనలు. జిల్లాలో 1095 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,45,094 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 4,61,315 మంది పురుషులు, 4,83,741 మంది మహిళలు, 38 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలో 14,130 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. 18 – 19 ఏళ్ల మధ్య వయసు గల వారు 22,096 మంది, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు 13,082 మంది ఉన్నట్లు గుర్తించాం. ఎన్‌ఆర్‌ఐలు 43 మంది, సర్వీస్ ఓటర్లు 731 మంది ఉన్నారు.

– ప్రియాంక అల, కలెక్టర్

విచారణ ఖైదీల విడుదలను పరిశీలించాలి

కొత్తగూడెంటౌన్: జిల్లాలో విచారణ ఖైదీలుగా జైలులో ఉన్నవారిలో అర్హత గల వారిని విడుదల చేసే విషయాన్ని పరిశీలించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా కోర్టులో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు ఈ రివ్యూ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, ఖమ్మం జిల్లా జైలర్ జి.లక్ష్మీనారాయణ, భద్రాచలం సబ్ జైలు సూపరింటెండెంట్ ఉపేందర్, ఇల్లెందు స్పెషల్ జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం, ఏజీపీ బాబురావు, జ్యోతి విశ్వకర్మ, నాగ ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జడ్జిలు



సాయిశ్రీ



శివానాయక్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు న్యాయయూర్తులుగా కె. సాయిశ్రీ, శివనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాయిశ్రీ మచిలీపట్నంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఎల్ పట్టా పొందారు. శివనాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ, ఆ తర్వాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మాస్టర్ లా పట్టా పొందారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలి

స్థాయీసంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

చుంచుపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా చూడాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అధికారులకు సూచించారు. జెడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపులలో సరుకులు పొందేందుకు వేలిముద్రలు పడక కొందరు ఇబ్బంది పడుతున్నారని, బయోమెట్రిక్‌కు బదులు ప్రత్యేకంగా ఐరిష్ పద్ధతి ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో బీసీబంధు పథకం అర్హులకు అందేలా గ్రేడింగ్ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు నిత్యం పనులు కల్పించేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు కిట్లు పంపిణీ చేస్తోందని, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు కరెంటు బిల్లులపై సబ్సిడీ ఎంత మేరకు వర్తిస్తోందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం కల్పించాలని చెప్పారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశాలలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, సీఈఓ విద్యాలత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లు ప్రశాంత జీవనం గడపాలి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: సీనియర్ సిటిజన్లు ప్రశాంత వాతావరణంలో జీవితాన్ని గడపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. బుధవారం ఆమె చమన్‌బస్తీలోని ముత్తబాయి మెమోరియల్ శ్రీ జ్యోతి అనాథాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృద్ధులు తమ జ్ఞానం, అనుభవాన్ని సమాజాన్ని సుసంపన్నం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారు మలిదశలో కోరుకునేది పలకరింపు, ఆత్మీయతలేనని తెలిపారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్ ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్ మక్కడ్, రామారావు, సాహూ సంతోష్, వి. పురుషోత్తమరావు, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

‘భూసేకరణ’కు గ్రామసభ అనుమతి తప్పనిసరి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: భూ సేకరణ ప్రాథమిక నోటిఫికేషన్‌కు గ్రామ సభ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. గతంలో ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రస్తుత పిటిషన్‌కు వర్తిస్తాయని పేర్కొంది. చట్టాన్ని పాటించకుండా ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. నిబంధనలు పాటించకుండా, భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి మణుగూరు, సమితి సింగారం గ్రామాల్లోని తమ భూముల స్వాధీన ప్రక్రియను అధికారులు చేపట్టారని ఆరోపిస్తూ మణుగూరుకు చెందిన సోడే సీతమ్మతో పాటు మరో 22 మంది హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ విచారణ చేపట్టారు. మణుగూరు రైల్వే స్టేషన్ నుంచి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వరకు రైల్వే లైన్ నిర్మాణం చేపట్టారని, దీనిలో భాగంగా చట్టవిరుద్ధంగా పిటిషనర్ల భూమిని సేకరిస్తున్నారని వారి తరఫున న్యాయవాది సీహెచ్.రవికుమార్ వాదనలు వినిపించారు. 2019 జూన్ 16న, 19న భద్రాచలం సబ్ కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేన్‌ను రద్దు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భూ సేకరణ చట్టం సెక్షన్ 41(3) ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాలోని భూ సేకరణకు గ్రామ సభ అనుమతి తప్పనిసరి స్పష్టం చేశారు. ఈ మేరకు నోటిఫికేన్‌ను రద్దు చేస్తూ, పిటిషన్‌ను అనుమతిస్తున్నట్లు తీర్పునిచ్చారు.

పామాయిల్ తోటల సందర్శన



పామాయిల్ తోటలో జగిత్యాల జిల్లా రైతులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని పామాయిల్ తోటలు, ఫ్యాక్టరీ, నర్సరీలను జగిత్యాల జిల్లాకు చెందిన రైతులు బుధవారం సందర్శించారు. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కొడిమ్యాల, మల్యాల మండలాలకు చెందిన రైతులు విజ్ఞాన యాత్రలో భాగంగా అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం వద్దగల ఆయిల్‌ఫెడ్ కేంద్రీయ నర్సరీ, స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ, పామాయిల్ క్షేత్రాలను పరిశీలించారు. వారికి ఆయిల్‌ఫెడ్ డీఓ ఆకుల బాలకృష్ణ పామాయిల్ తోటల సాగు విధానం, రాయితీలు, ఆదాయం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జగిత్యాల ఏఈఓ భువనేశ్వర్, ఎఫ్ఓ రాహుల్, స్థానిక నర్సరీ ఇన్‌చార్జ్ మహేష్, ఎఫ్ఓ చందు పాల్గొన్నారు.

ఫలితాల సాధనకు ప్రణాళిక

- గిరిజన విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి
- 100 రోజుల ప్రణాళికతో ప్రత్యేక కార్యాచరణ
- గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలపై ఐటీడీఏ పీఓ దృష్టి
- ఏజెన్సీ డీఈఓ పోస్టు పునరుద్ధరించాలని పలువురి డిమాండ్



ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులు (ఫైల్)

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఫలితాలు రావడమే కాకుండా ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడం, తద్వారా ఉన్నత విద్యలో రాణించేందుకు వినూత్న ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణ తయారుచేస్తున్నారు.

‘కే 12’ సహకారంతో..

గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల పర్యటన సందర్భంగా విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయని పీఓ గ్రహించారు. వారు చదువులో బేసిక్ లెవల్స్ కనుగొనేలా హైదరాబాద్‌కు చెందిన కే12 యాక్టివిటీ అకాడమీ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్రతి పాఠశాలలో నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే నిర్వహించారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ఐటీడీఏ పరిధిలో గల 285 పాఠశాలల్లో 12,859 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, బేసిక్ లెవెల్స్ తక్కువ స్థాయిలో ఉన్నాయని తేలడంతో వారి కోసం ప్రత్యేక సావనీర్ సిద్ధం చేశారు. రీడింగ్, రైటింగ్, టీచింగ్ పేరుతో ఇప్పటికే ఈ శిక్షణ ప్రారంభమైంది. విద్యార్థులకు వర్క్‌బుక్‌లు, డిక్షనరీలు, ఇతర మెటీరియల్ అందజేశారు. దీంతో పాటు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం ‘లెర్న్ ఏ వర్డ్ ఇన్ ఏ డే’ పేరిట వినూత్న కార్యక్రమం నడుస్తోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత కేటగిరీలుగా విద్యార్థులను విభజించి వారికి తర్ఫీదు ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో రోజుకో కొత్త పదం నేర్పి, దానిపై రోజంతా అవగాహన కల్పిస్తున్నారు. ఆ తర్వాత కేటగిరీలో చదవడం, గ్రామర్ నేర్పిస్తున్నారు.

ఏజెన్సీ డీఈఓ పోస్టు భర్తీతో మరింత న్యాయం..

ప్రస్తుతం గిరిజన గురుకులాలను ఇన్‌చార్జ్ ఆర్‌సీఓలు, ఆశ్రమ పాఠశాలలను ఇన్‌చార్జ్ డీడీలు పర్యవేక్షిస్తున్నారు. వీరికి ఇతర బాధ్యతలు ఎక్కువగా ఉండడంతో విద్యాసంస్థలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారు. గతంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ డీఈఓ పోస్టు ఉండేది. 2016లో జిల్లాల పునర్విభజనలో ఈ పోస్టును జిల్లా విద్యాశాఖాధికారిగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఏజెన్సీ డీఈఓ పోస్టు రద్దయింది. గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు ఏజెన్సీ డీఈఓ ఉంటే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. గిరిజన విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న పీఓ ఈ సమస్యపైనా దృష్టి సారించాలని గిరిజన, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వంద రోజుల ప్రణాళికతో..

గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేందుకు పీఓ ప్రతీక్ జైన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ చివరి వరకు సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి పరీక్షల ప్రిపరేషన్ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. సిలబస్ పూర్తయిన తర్వాత విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారి ప్రతిభ ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించి, వారి స్థాయికి తగ్గట్టుగా ప్రిపరేషన్ కొనసాగించేలా ప్రణాళిక రూపొందించారు. గణితం, సోషల్ సబ్జెక్టులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మెటీరియల్ సిద్ధం చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక

గిరిజన విద్యార్థులు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, డీడీ మణెమ్మ ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించాం. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచేందుకు, ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

– రమణయ్య, ఏసీఎంఓ

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

చర్ల: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రత్యక్షంగా, పరోక్షంగా నేరాలకు పాల్పడితే జైలు జీవితం తప్పదని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ బి.రాజగోపాల్, ఎస్సైలు నర్సిరెడ్డి, పీవీఆర్ సూరి వెంకటప్పయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం అడ్డగింత

దళితబంధు మంజూరు చేయాలని నిరసన



దళిత యువకుడిని పక్కకు తీసుకెళ్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

పాల్వంచరూరల్: దళితబంధు పథకాన్ని మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఓ యువకుడు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వాహనాన్ని అడ్డగించాడు. సంగంగట్టు గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు వెళ్లిన ఎమ్మెల్యే తిరిగి వస్తుండగా సంగం గ్రామంవద్ద దళిత యువకుడు తమకు దళితబంధు మంజూరుచేయాలని కోరుతూ మరో ఇద్దరు చిన్నారులతో కలిసి రోడ్డుకు అడ్డంగా నిలబడ్డాడు. దీంతో రూరల్ ఎస్‌ఐ కార్తీక్, పోలీసు సిబ్బంది వారిని బలవంతంగా రోడ్డు పక్కకు లాక్కెళ్లడంతో ఎమ్మెల్యే కాన్వాయ్ అక్కడనుంచి వెళ్లిపోయింది.

15 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల గడువు

బూర్గంపాడు: ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అపరాధ రుసుంతో ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల సార్వత్రిక విద్యాపీఠం ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చదువులు మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 97019 16240 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

అశ్వాపురం/భద్రాచలంటౌన్: మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న తాత్కాలిక(పార్ట్‌టైం) అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, కళాశాల ప్రిన్సిపల్ జీ.స్వప్నకుమారి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఫిజిక్స్-1, బోటని-1, గణితం-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీజీలో 55 శాతం మార్కులు, సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. డెమోక్లాస్‌కు ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. దరఖాస్తులకు ధ్రువీకరణపత్రాల జిరాక్స్‌లు, ఫొటోలు జత చేయాలని, వివరాలకు 79010 97698, 9550 406691 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ

సుజాతనగర్: మండల పరిధిలోని రూప్లాతండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడ్డారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయినులు విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం ఓ ఉపాధ్యాయురాలు పాఠశాలకు వచ్చి కొంతసేపటి తర్వాత వెళ్లిపోయారు. విద్యాశాఖ కార్యాలయంలో పని ఉందంటూ పాఠశాలను విద్యావలంటీర్‌కు అప్పగించి మరో ఉపాధ్యాయురాలు సైతం వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇద్దరు విద్యార్థులు కొట్టుకున్నారు. 5వ తరగతి విద్యార్థి బెత్తంతో కొట్టగా 3వ తరగతి విద్యార్థికి స్వల్పంగా గాయాలయ్యాయి. సదరు విద్యార్థి ఇంటికి వెళ్లి తండ్రికి చెప్పగా, ఆయన పాఠశాలకు వచ్చి విద్యావలంటీర్‌ను ప్రశ్నించాడు. దీంతో అతను నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఉపాధ్యాయులు లేకుండా పాఠశాల ఎందుకు తీశారని, మూసివేయాలంటూ విద్యార్థి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో విద్యావలంటీర్ పాఠశాలను మూసేశాడు. ఈ ఘటనపై మండల విద్యాశాఖాధికారి జుంకీలాల్‌ను వివరణ కోరగా.. విద్యావలంటీర్ వ్యవస్థ లేదని, ఘటనపై విచారణ నిర్వహిస్తానని తెలిపారు.

కంకర ట్రాక్టర్ సీజ్

బూర్గంపాడు: మండల పరిధిలోని తాళ్ల గొమ్మూరు గుట్ట నుంచి అక్రమంగా కంకరను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకుని తహసీల్ కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా తరలిస్తుండటంతో రూ. 10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ రాజారావు బుధవారం తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

23 రోజులపాటు కొనసాగిన ఆందోళనలు

- చర్చల్లో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- నేటి నుంచి విధుల్లో చేరనున్న టీచర్లు, హెల్పర్లు

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు బుధవారం సమ్మె విరమించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 11 నుంచి సిబ్బంది విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిల్లో 1,434 మంది అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్లు 626 మంది, హెల్పర్లు 1,434 మంది పని చేస్తున్నారు. వీరంతా సమ్మె చేపట్టడంతో జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి.

వివిధ రూపాల్లో నిరసన

అంగన్‌వాడీ సిబ్బంది వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. కలెక్టరేట్ వద్ద రెండు టెంట్‌లు వేసి దీక్షలు నిర్వహించారు. మానవహారాలు నిర్మించారు. కళ్లకు గంతలు కట్టుకుని, చెవిలో పువ్వులతో, భిక్షాటన చేపడుతూ, ఆటపాటుల, వంటావార్పు తదితర కార్యక్రమాలతో ఆందోళనలు కొనసాగించారు. దీంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. బుధవారం సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి చొరవతో హైదరాబాద్‌లో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌లతో యూనియన్ల నాయకులు చర్చలు జరిపారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. 23 రోజుల పాటు సమ్మె కొనసాగించిన అంగన్‌వాడీ సిబ్బంది గురువారం కలెక్టర్, డీడబ్ల్యూఓలను కలిసి విధుల్లో చేరనున్నారు.

సాధించిన డిమాండ్లు ఇవే..

అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష, ఐఆర్ 5 శాతం పెంపు, పీఆర్సీలో వేతనం పెంపు, ఇన్సురెన్స్ రూ.2 లక్షలు, వేసవి సెలవులు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను, ప్రధాన కేంద్రాల టీచర్లుగా గుర్తింపు, పెండింగ్ ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు చెల్లింపులు తదితర డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సమ్మె కాలపు వేతనం చెల్లించేందుకు అంగీకరించింది.

అందరికీ ధన్యవాదాలు



సమాన పనికి సమాన వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే చేపట్టిన సమ్మెకు పూర్తిగా సహకరించి విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం హర్షణీయం.

–గోనె మణి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

ఐక్య పోరాటం వల్లే..



సమ్మెతో ప్రభుత్వం స్పందించింది. మా సమస్యలను విని కొన్నింటిని పరిష్కరించి, మరికొన్ని సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇచ్చింది. టీచర్లు, హెల్పర్లు అందరం ఐక్యంగా ఉద్యమించడం వల్లే ఇది సాధ్యమైంది. హామీలు నెరవేర్చకపోతే మళ్లీ పోరుబాట పడతాం.

–రూప, అంగన్‌వాడీ టీచర్, కొత్తగూడెం

పెద్దమ్మతల్లి భక్తులకు మరిన్ని సౌకర్యాలు

- ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తున్నాం
- రెండు ఫంక్షన్ హాళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వనమా



ఫంక్షన్ హాళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వనమా, అధికారులు

పాల్వంచరూరల్: రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా పెద్దమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం ఎదుట రూ.3.90 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు ఫంక్షన్ హాళ్లను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను, అన్నదాన సత్రం, కమ్యూనిటీ హాల్ నిర్మాణ దాత నూతక్కి శ్రీనివాసరావును దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.రామకృష్ణారావు తదితరులు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల వసతికి ఇబ్బంది కలగకుండా దేవస్థానం పరిధిలో రెండు ఫంక్షన్ హాళ్లను నిర్మించామని తెలిపారు. వీటిని భక్తులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ.సులోచన, ఆలయ ఈఓ రజనీకుమారి, శాఖ అధికారులు సత్యనారాయణ, పరిశీలకులు పి.బైల్‌సింగ్, వెంకటేశ్వర్లు, సుమత, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, జెడ్పీ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్లు కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడవి సరస్వతితో పాటు కిలారు నాగేశ్వరరావు, బానోతు అనిత, జగదీశ్‌కుమార్, యర్రంశెట్టి ముత్తయ్య, బండ్లపల్లి వెంకటనారాయణ, శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే గెలలకు మెరుగైన ధర

తెలంగాణ పామాయిల్ రైతుల సంఘం కన్వీనర్ పుల్లయ్య



ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు సిద్ధంగా ఉన్న గెలలను పరిశీలిస్తున్న పుల్లయ్య

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ గెలల ధరల పతనాన్ని అడ్డుకుని మెరుగైన ధర సాధించడానికి ఐక్య పోరాటాలే మార్గమని తెలంగాణ పామాయిల్ రైతుల సంఘం కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య పేర్కొన్నారు. అశ్వారావుపేటలోని ఆయిల్‌పామ్ స్థానిక ఫ్యాక్టరీని బుధవారం సందర్శించిన ఆయన మాట్లాడారు. ప్రతీనెల గెలల ధర తగ్గుతుండటంతో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతుల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్‌ఫెడ్ అధికారుల తీరుతో ప్రస్తుతం సంక్షోభం నెలకొందన్నారు. ఇక్కడ ఫాక్టరీల ద్వారా వస్తున్న ఆదాయంతో ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి చేయడమే ఇందుకు కారణమన్నారు. కొన్నేళ్లుగా ఆయిల్‌ఫెడ్‌లో వచ్చిన నిధులు, సంపదను ఇతర జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెంపు సాకుతో ఖర్చు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వకపోవడంతో ఆయిల్‌ఫెడ్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలను తాకట్టు పెట్టి వచ్చే డబ్బుతో రైతుల విజ్ఞాన యాత్ర, ప్రదర్శనలు, నూతన భవనాలు, కొత్త పరిశ్రమలకు శంకుస్థాపనలు, నూతన నర్సరీలను ఏర్పాటు చేశారని పుల్లయ్య ఆరోపించారు. ఈ రెండు ఫ్యాక్టరీల్లో కలిపి సుమారు 45 వేల మెట్రిక్ టన్నుల ముడి నూనె ఉత్పత్తి అవుతుంటే, స్థానికంగా ఏర్పాటు చేయాల్సిన ఆయిల్ రిఫైనరీ, ప్రాసెసింగ్ యూనిట్లను సిద్దిపేటలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. ఇకనైనా రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నాయకులు, రైతులు ఐక్య పోరాటాలు చేయాలని ఆయన కోరారు.

పాముకాటుతో ఎంపీటీసీ మృతి



ఎంపీటీసీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా, తదితరులు

దమ్మపేట: పాముకాటుకు గురైన ఎంపీటీసీ సభ్యురాలు, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దిబ్బగూడెం గ్రామానికి చెందిన, జగ్గారం ఎంపీటీసీ సున్నం కుమారి(36)మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో తన భర్త కృష్ణ, కూలీలతో కలసి గ్రామ శివారులోని మెరకపొలంలో ఉన్న ఇసుక కోసం ట్రాక్టర్‌లో వెళ్లారు. ఇసుక లోడింగ్ పూర్తయ్యాక వీరంతా నడుచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో సమయం రాత్రి ఒంటి గంట కాగా ఎంపీటీసీ సభ్యురాలిని పాము కాటు వేసింది. వెంటనే ఆమెను దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, నాయకులు దారా యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, ఊకే వెంకటేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

భద్రాచలం నుంచి భీమవరానికి ఆర్టీసీ సర్వీస్



సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏపీలోని భీమవరానికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను భద్రాచలం డిపో మేనేజర్ రామారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వీస్ రోజూ మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. కొత్తగూడెం, సత్తుపల్లి, చింతలపూడి, ఏలూరు మీదుగా రాత్రి 8.30కి భీమవరం చేరుతుందని పేర్కొన్నారు. మళ్లీ భీమవరంలో ఉదయం 6.15కు బయలుదేరి మధ్యాహ్నం 12.45కు భద్రాచలం వస్తుందని తెలిపారు. ప్రయాణికులు ఈ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ వి.గౌతమి, ఓపీఆర్ఎస్ వెంకన్న, కంట్రోలర్ నర్సింహులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో మెళకువలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చుంచుపల్లి: కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పెనగడప గ్రామంలో మొక్కజొన్న సాగులో మెళకువలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రబీ వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేయవచ్చని అన్నారు. వరి కోత కోసిన తర్వాత దుక్కి దున్నకుండా శూన్య దుక్కి (జీరో టిల్లేజ్) పద్ధతిలో విత్తుకుంటే దుక్కి ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. లభ్యమయ్యే నీటి తడులను బట్టి స్వల్పకాలిక, మధ్యకాలిక హైబ్రిడ్స్ విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వాతావరణ విభాగం పర్యవేక్షకులు ఎం.సుమన్ మాట్లాడుతూ వ్యవసాయ వాతావరణ సేవా పథకంలో భాగంగా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాల సూచనలు సామాజిక మాధ్యమాల ద్వారా పంపుతామని తెలిపారు. చుంచుపల్లి మండల వ్యవసాయ అధికారి బి.రాజేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.మమత, గ్రామ సర్పంచ్ మాలోతు కళావతి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు తేజావత్ చంటి

జూలూరుపాడు: జూలూరుపాడు ఒంటిగుడిసె క్రాస్ రోడ్ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం భద్రుతండాకు చెందిన తేజావత్ చంటి, బానోత్ వెంకటేష్‌లు బైక్‌పై జూలూరుపాడు వచ్చి తిరిగి వెళుతున్నారు. అదే సమయంలో ఒంటిగుడిసె క్రాస్ రోడ్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో చంటి, వెంకటేష్‌లు ఎదురుగా ఆగి ఉన్న కారును బైక్‌తో ఢీకొట్టారు. దీంతో చంటికి తీవ్రంగా, వెంకటేష్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కొత్తగూడెం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో వాహనాదారులు కొందరు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి బుధవారం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుర్రాలచెరువు గ్రామానికి చెందిన యర్రా శ్రీను ద్విచక్రవాహనంపై ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గంమధ్యలోని సరిహద్దు చెక్‌పోస్టు దగ్గర గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీను తీవ్రంగా గాయపడగా, స్థానికులు చిట్టితల్లి అంబులెన్స్‌లో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సెల్ ఫోన్ చోరీ చేసిన వ్యక్తికి దేహశుద్ధి

పాల్వంచరూరల్: ఓ ట్రాక్టర్ షోరూమ్‌లో స్మార్ట్ ఫోన్‌ను చోరీ చేసిన వ్యక్తిని బుధవారం పట్టుకుని దేహశుద్ధి చేశారు. మండల పరిధి లోని లక్ష్మీదేవిపల్లి పంచాయతీ అంబేద్కర్ కాలనీలో ఉన్న ఓ ట్రాక్టర్ షో షోరూంలో పనిచేసే సిబ్బంది సెల్‌ఫోన్ చోరీకి గురైంది. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా, నిందితుడు శ్రీను గుర్తించి పట్టుకున్న దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్‌ఐ కార్తీక్‌ను వివరణ కోరగా.. తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని, ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

జవాన్‌ను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు బస్తర్ బెటాలియన్‌కు చెందిన ఓ జవాన్‌ను కిడ్నాప్ చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీజాపూర్ జిల్లా బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రమన్నార్ గ్రామానికి చెందిన కుడియం శంకర్(28) ఉపాధ్యాయుడిగా పని చేస్తూ బస్తర్ బెటాలియన్‌లో జవాన్‌గా ఎంపికయ్యాడు. అతడు బీజాపూర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్‌లో ఉంటూ విధుల్లో పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో గత నెల 27న ఎర్రమన్నార్‌కు వెళ్తున్నానంటూ అక్కడి నుంచి బయలుదేరాడు. 8 రోజులైనా ఇంటికి చేరుకోకపోయేసరికి కుటుంబసభ్యులు ఆరా తీయగా సెప్టెంబర్ 29న ఉప్పరి గ్రామ సమీపం నుంచి మావోయిస్టులు కిడ్నాప్ చేసినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో కుటుంబసభ్యులు, సమీప అటవీ ప్రాంత వాసులు వెదికినా ఆచూకీ లభించలేదు. మావోయిస్టులే శంకర్‌ను కిడ్నాప్ చేసి ఉంటే సురక్షితంగా విడుదల చేయాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో గర్భిణి ఆత్మహత్య

పురుగు మందు తాగి, అపస్మారక స్థితిలో భర్త



స్వప్న (ఫైల్)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్

పినపాక: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని ఏడు నెలల గర్భిణి ఆత్మహత్యకు పాల్పడగా, ఆమె భర్త సైతం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారక స్థితికి చేరిన ఘటన మండలంలోని ఉప్పాకలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్ అదే పంచాయతీ పరిధిలోని మడతనకుంట గ్రామానికి చెందిన స్వప్న (22)ను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. సాయికుమార్ ఏడూళ్ల బయ్యారంలో 108 వాహన డ్రైవర్‌గా, స్వప్న బీటీపీఎస్‌లో జేపీఏగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం విధులకు హాజరైన ఇద్దరూ మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చిన సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన స్వప్న ఇంట్లోనే ఉరి వేసుకోగా గమనించిన కుటుంబసభ్యులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న భర్త సాయికుమార్ కూడా మణుగూరు పట్టణ సమీపంలో పురుగుమందు తాగాడు. స్థానికులు 108 వాహనం ద్వారా మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, సాయికుమార్ అరచేతిపై తన చావుకు ఓ మహిళా డాక్టరే కారణమని రాసుకున్నట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం దీనిని ధ్రువీకరించలేదు.

కేటీపీఎస్ ఆర్టిజన్ ఆత్మహత్య



స్వామి(ఫైల్)

పాల్వంచరూరల్: కేటీపీఎస్ ఆర్టిజన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. బస్వాతారకకాలనీ పంచాయతీ సీతానగర్‌కాలనీకి చెందిన గుడిపోల్ స్వామి అలియాస్ సాంబ (38) కేటీపీఎస్‌లో ఆర్టిజన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నాలుగురోజుల క్రితం భార్యతో గొడవ పడి గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామానికి చెందిన బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ కార్తీక్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. నాలుగు రోజుల క్రితం చనిపోయినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో మహిళ..

ఇల్లెందు: మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పాయం రామక్క(50) మద్యం మత్తులో పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. హెడ్‌కానిస్టేబుల్ లింగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరివేసుకుని..

పాల్వంచ: భార్య చనిపోయిందనే మనోవేదనతో ఓ వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన చెలిమెల వెంకటేశ్వర్లు(60) భార్య ఏడాది క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న వెంకటేశ్వర్లు బుధవారం వంటచెరకు కోసం వెళ్లి కాలనీ శివారు శ్మశాన వాటికలో వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో గిరిజన వృద్ధుడు మృతి



వెంకప్ప మృతదేహం

అశ్వారావుపేటరూరల్: ఓ గిరిజన వృద్ధుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. అదనపు ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం తెల్లపల్లి గ్రామానికి చెందిన మడకం వెంకప్ప(72) మంగళవారం అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామంలో నివాసం ఉంటున్న తన చిన్న కుమారుడు రాముడు ఇంటికి వచ్చాడు. కాగా ఇంట్లో పడుకున్న వెంకప్ప తెల్లవారేసరికి శవమై కనిపించాడు. వృద్ధుడి మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కరుణాకర్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ : ఒకరు మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం వద్ద నివాసం ఉంటున్న బిహార్ యువకులు ముర్తుజా అలియాస్ చోటు(27), నారధ్, సుబుల్ సోది ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట సంత మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలు కొనుగోలు చేసుకుని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ కళాశాల సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనాన్ని తప్పించే క్రమంలో వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి చోటు మృతి చెందాడు. నారధ్, సుబుల్ సోదిలను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. కాగా మృతుడికి ఏడాది క్రితమే వివాహం జరిగింది. అదనపు ఎస్సై శివరామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
286	93
65,226	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,154	△	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	△	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,653 ▽ 22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426 ▽ 22
వెండి (కిలో)	67,446 △ 409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.47	84.14
£	బ్రిటన్ పౌండ్		98.87	102.21
€	యూరో		85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)		54.95	56.65
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.46	53.74
S$	సింగపూర్ డాలర్		59.65	61.57
SAR	సౌదీ రియాల్		21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.53
¥	చైనా యువాన్		10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హుడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్చేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడం తోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.



నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాల ప్రభావం

ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్టం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ



ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.

- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్లు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117-118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.



వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి

న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం



తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.

భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, డయాజియో, ఎంఆర్ఎఫ్, లెండింగ్‌కార్ట్, బీపీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా-కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్డ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్-సర్వ్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.



విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవ హర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:**జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు -100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికెట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్-2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగపూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్-02, క్లినికల్ సైకాలజిస్ట్-01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్)-01, యోగా ఇన్‌స్ట్రక్టర్-01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్-04, స్టోర్ కీపర్-04, జూనియర్ ఇంజనీర్-03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్-01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్-02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-01, ఆప్టోమెట్రిస్ట్-02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)-16, టెక్నీషియన్(రేడియాలజీ)-02, ఫార్మసిస్ట్-05, ఫైర్ టెక్నీషియన్-02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు-02, స్టెనోగ్రాఫర్-04, లాండ్రీ సూపర్‌వైజర్-01, జూనియర్ వార్డెన్-02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్శిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్ పొందొచ్చు. మరో వైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్ట్‌లలో నెట్ నిర్వహణ

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ-నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ-నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్టులలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ-నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్-1.. 50 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటుంది.
ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్-2.. 100 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

పేపర్ ఎంపిక ఎలా

- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్-1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.



కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్-ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం-నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం-అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్టులుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్-1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్-1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్-గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ పేపర్

పేపర్-2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:**30, 31 అక్టోబర్ 2023
- **పరీక్ష తేదీలు:** 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in